# దటీజ్ మగాడు!

ఈ విశాల విశ్వంలో నవ్వే వాళ్లకంటే ఏడ్చేవారు ఏడుపుగొట్టువారే అధికం!.

శ్రీహరికే ఏడవటం చేతకాదు. విషాద సమయాల్లో సైతం పకపక నవ్వేస్తాడు. వాడు పుట్టినప్పుడు డాక్టర్ అతడిని తల్లకిందులుగా వేలాడదీసినా ఏడవకపోవటంతో పిర్రమీద గిల్లాడట! అయినా సరే నవ్వాడటగాని 'కెవ్వు'మన్లేదని లేబర్ రూమ్‌లో వున్న నర్స్... పురుడు పోసిన లేడీ డాక్టర్ స్పృహలోకొచ్చాక కాన్పు అయిన ఆవిడకు (అనగా శ్రీహరి తల్లికి) చెప్పారట!

చిన్న తనంలో శ్రీహరి అల్లరి చేసినప్పుడు మమ్మీ డాడీలు కొట్టినా దండించినా ఏడ్చేవాడే కాదు. ప్రత్యామ్నాయంగా కిలకిలా నవ్వేవాడు.

డిగ్రీ తప్పినా ఏడవలేదు సరికదా... కనీసం బాధ పడనైనాలేదు. లవ్వంటూ ఆడపిల్లల వెంటతిరిగి వాళ్లు తిట్టినా బాధపడి ఏడ్చేవాడే కాదు. కనీసం కళ్ల నీళ్లుకూడా పెట్టుకునే వాడే కాదు శ్రీహరి! అదే అతనిలో వున్న స్పెషాలిటీ!

మగాళ్లు నవ్వటం రేర్! నవ్వు ఆడవాళ్ల ఆస్తి! అట్లాంటిది శ్రీహరి అయిన దానికి కాని దానికి నవ్వటం అతనికో ప్లస్ పాయింట్!

తల్లి తండ్రీ చనిపోయినపుడు కూడా కంట్లో నీరు సుళ్లు తిరక్కపోవటం వింతేమరి! వీడేమిటి కన్నవారు కన్నుమూసినా ఏడవడు అనుకున్నారు బంధు జనమంతా! ఇంకోడు ఇంకోడైతే శోకాండాలు పెడుతూ వెక్కివెక్కి గంటల తరబడి ఏడ్చేసేవారు.

శ్రీహరిది టీచరుద్యోగం! డిగ్రీ మిడికాక బి.ఇడి ట్రైనింగ్ అవగానే టీచర్ పోస్టొచ్చింది. ఈ వుద్యోగం హాయిగా వున్నదనిపించింది. క్లాసుకు పిల్లలు వచ్చినా రాకపోయినా... పాఠాలు చెప్పినా చెప్పకపోయినా ఎంచక్కా ఫస్ట్ కల్లాజీతం దోసిట్లో వుంటుంది. అటుపై శాలరీ పాకెట్లోకి.. చివరకు ఖర్చులకు... అప్పులకు పోనూ మిగిలింది బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్లోజమౌతుంది.

వెనకటి రోజుల్లా కాదు. నేడు టీచర్లకు జీతాలెక్కువ! ఇతరుల కళ్లు కుట్టేటంత లేదూ చెదిరేటంత ఎక్కువ జీతాలొస్తున్నయ్ ఇప్పుడు! అంచేత జల్సా ఖర్చులు ఎక్కువైనయ్. బార్లు క్లబ్బుల కెళ్లటం మరిగారు.

ఒకప్పుడు బతకలేక బడిపంతులనే సామెత సర్క్యులేషన్లో వుండేది. ఆ రోజులు పోయాయి! ఇప్పుడు జిల్లా కలెక్టర్ కొచ్చినంత జీతాలు వీరికి...!

ఈరోజుల్లో చీకు చింతాలేనిది బడిపంతులు వుద్యోగం కావటాన శ్రీహరి పరమ హేపీగ వున్నాడు. ఇతరులను చూచి తనూ జల్సాలకు అలవాట్లుపడ్డాడు.

మమ్మీ డాడీ బతికున్న రోజుల్లోనే... వుద్యోగం వచ్చి ఏడాది తిరక్కుండానే ఎల్లి చేశారు శ్రీహరికి. రూపవతి అయిన శ్రీమతి తనకు జీవిత భాగస్వామి అయినందుకు చంకలు గుద్దుకున్నాడు!

శ్రీహరి దుష్టుడు.. దుర్మార్గుడు కాకపోయినా అతనిలో వేరొక మనిషి దాగున్నాడు. అదేమిటన?.. ఇంకో అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకోమని అంతరాత్మ ఘోషిస్తున్నా... అందుకు సాహసించని శ్రీహరికి బహుళ వివాహాలపై గాలి మళ్లింది. కానీ ఇదెలా సాధ్యం? భార్యకు డైవోర్స్ ఇస్తేగాని లీగల్గా సెకండ్ మార్యేజ్ చేసుకునే అవకాశం వుండదు. పెళ్లాం చచ్చినా విడాకులు ఇవ్వటానికి వప్పుకోదు. అంచేత దానికి ఆయుర్దాయంమూడాలి! అప్పుడు గానీ రెండో పెళ్లికి ఫ్రీడమ్ వుండదు. తన భార్యను చేజేతులా చంపి పాపం మూట కట్టుకోలేడు. హంతకుడు కాలేడు. జైలు జీవితం గడప మనస్కరించదు. మరి శ్రీమతికి చావెలా వస్తుందనే దుర్మార్గపు ఆలోచన కుమ్మరి పురుగై అతగాడి బుర్రను తొలిచేస్తోంది. ఈ ఆలోచన మనసులో ఎంటరైన క్షణం నుండి భార్యతో అన్యోన్యంగ వుండమనస్కరించటం లేదు. భార్యను తొందరగా తీసుకుపోదేవుడాని కోటి దేవుళ్లకు ఒక్కటే మొక్కటం.

అదృష్టం పండి ఒకరోజు రాత్రి శ్రీహరి భార్య నిద్రలోనే గుండె ఆగి మరణించటం అతని పాలిట అదృష్టమైంది.

భార్య చనిపోయిందని బంధులందరికీ మొబైల్లో తెలీపరిచాడు శ్రీహరి. హుటాహుటిన టాక్సీలో అత్తమామలు వచ్చివాలారు.

మొత్తానికి తాను కలలుకంటున్న ప్రకారమే భార్య కన్ను మూసింది. హమ్మయ్య! మొత్తానికి ఆ దేవుడు దీన్ని తీసుకెళ్లి పుణ్యం కట్టుకున్నాడు అని మనసులో సంతోషించాడు. ఎవరైనా భార్య చనిపోతే విలవిల్లాడి... వలవలా ఏడుస్తారు. కానీ శ్రీహరి విషయంలో ఈ పాయింట్ రివర్స్!

అతని వదనంలో విచారం లేదు. కళ్లు చెమగిల్లటం లేదు. ఏడుపు రావటం లేదు. భార్య పోయిందనే బాధ ఏకోశాన కన్పించకపోవటం చూచిన ఇరుగు పొరుగు... ఫ్రెండ్స్... బంధుజనం... అత్తమామలు నివ్వెరపోయారు.

అతని అంతరాత్మ మాత్రం భార్య పోయినందుకు తెగ వుబలాటపడుతూ పళ్లికిలించి సంతోషిస్తోంది.

జీవితంలో నాలుగైదు పెళ్లిళ్లు చేసుకోవాలనే కోరిక శ్రీహరి అంతరంగంలో ఎంతో కాలంగా వుంది. ఇప్పుడైతే ఒక వికెట్ పడింది.

పెళ్లాం చనిపోతే మొగుడనే మగాడు ఎందుకు ఏడవాలి పసిపిల్లాడిలా? అనేదే శ్రీహరి వితండ వాదం! ఇప్పుడు శ్రీహరి దృష్టి... ఆలోచన పునర్వివాహం కోసం పరుగుపెడుతోంది.

మొత్తానికి తన చేతికి మట్టి అంటకుండా ఆమెంతట ఆమెకు చావు ముంచుకొచ్చి చచ్చింది! పీడ విరగడైంది శ్రీహరి దృష్టిలో...

నిజంగా తను లక్కీఫెలోనే! కాకుంటే తన మనసులో ఆలోచన పసికట్టిన దేవుడు భార్యకు నాచురల్ డెత్ ప్రసాదించినందుకు విధేయుడే! దేవుడు చాలా మంచోడు కనుకనే తన కోరిక నెరవేర్చాడు. ఆయన దయామయుడు!... కరుణామూర్తి.

భర్త చనిపోతే భార్య జీవించినంత కాలం కుల్లి కుల్లి ఏడుస్తూనే వుంటుంది. పునర్వివాహనికి ఆడాళ్ల మనసు వప్పుకోదు. మగాళ్లు... యూస్‌లెస్ ఫెలోస్ కనుకనే ఏడాది తిరక్కుండానే సెకండ్ మ్యారేజ్‌కి సిద్ధపడతారు.

మగాడు నిజంగా స్వార్థపరుడు! బ్రతికివున్నపుడే కాదు... చచ్చిపోయిన వారికీ అన్యాయం చేస్తూంటాడు.

ఆఫ్టాల్ భార్యాభర్త! ఒకరి కోసం మరొకరు త్యాగాలు చేసుకోనవసరం లేదు. ప్రేమలు... ఆపేక్షలు... అంతాభాష్! ఎవరి సుఖంవారు చూసుకోక తప్పదు.

దినాలు అవకముందే ఇంట్లో వున్న బంధువుల్లో కొందరు శ్రీహరిని మళ్లీ పెళ్లి చేసుకోవలసిందిగా సలహా ఇచ్చారు. ఇదేం ప్రపోజల్?

లోలోపల సెకెండ్ మ్యారేజ్ కోసం మనసులొట్టలేసుకున్నా... పైకి మళ్లీ పెళ్లా? దినాలైనా పూర్తి కాకుండా ఇదేం పాడు ఆలోచన?' ఎదుటి వారి తృప్తి

కోసం మాట్లాడాడు శ్రీహరి.

వీళ్లే కాదండీ బాబూ... వూళ్లో వున్న ఆడపిల్లల తండ్రులు కట్నం ఇచ్చుకునే ఆర్థిక స్థోమత లేని వారు... శ్రీహరి సంపాదన... సిరి సంపదలు చూసి పిల్లను తామంటే తామిస్తామంటూ ఇంటిముందు 'క్యూ'కట్టారు!

'రెండో పెళ్లి వాడిక్కూడా ఇంతడిమేండా?-' మనసులో విస్తుపోయాడు శ్రీహరి.

అవునుమరి... గుండెల మీద కుంపటిలావున్న కూతుళ్లను వదిలించుకోవటానికి మార్గమేదైనా సరే ఇష్టపడేవాళ్లున్నారు ఇంకా ఈ సొసైటీలో!

బాగా చదువుకున్న ఆడపిల్లలు... వుద్యోగం చేసి ఆర్జిస్తున్న ఆడవాళ్లు సైతం సెకండ్ మ్యారేజ్‌కి సిద్ధపడటం నిజంగా ఆశ్చర్యంగా తోచింది శ్రీహరికి.

తన కుమార్తె మెడికో అని... పి.జి చేసిందని... ప్రభుత్వోద్యోగం చేస్తోందని... ఇంటిపని వంటిపని చేయటంలో సిద్ధహస్తురాలనీ... రకరకాల ఆఫర్స్‌తో తనను సంప్రదిస్తున్నారు. ఇంతమందిలో తాను ఎవరిని ఎన్నుకోవటమో అర్థం కాక తిక్కబట్టిపోతోంది!

శ్రీహరి కరుణాకటాక్ష వీక్షణాల కోసం పిల్లనివ్వటానికి ఆడపిల్లలను కన్న తండ్రులు సంప్రదింపులు స్వయంగా... లాండ్‌లైన్... మొబైల్ ద్వారా తనకు విశ్రాంతి లేకుండా జరుపుతూనే వున్నారు.

ఎవరి పిల్ల నచ్చిందీ తేల్చిచెప్పేదాకా ఇంటిముందు నిరాహారదీక్షకు సామూహికంగా పూనుకోవటానికి వెనకాడేది కాదని తేల్చి చెప్పి కార్యాచరణకు పూనుకోవటం చూస్తూ... శ్రీహరికి వున్నమతి కాస్తా పోతుందేమోనే భయం పట్టుకుంది!!

(సమాప్తం)